

వైద్యులకు భద్రత కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటన మమ్మల్ని తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. ఆసుపత్రుల్లో సెక్యూరిటీని పెంచాలి. వైద్య సిబ్బంది భద్రతకు ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడటం సంతోషకరం. వైద్యుల భద్రతపై విధి విధానాల రూపకల్పనకు 10 మందితో కూడిన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పడం హర్షణీయం. కేవలం ఆస్పత్రుల్లోనే కాకుండా మహిళలు పని చేసే అన్ని ప్రాంతాల్లో భద్రతను పెంచాలి.

డాక్టర్ పసుపులేటి అనూష, ఎంఎస్ జనరల్ సర్జన్, సీహెచ్‌సీ, పెదపూడి



వైద్య సిబ్బందిపై దాడులు దుర్మార్గం



రోగుల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దుర్మార్గం. దాడుల నుంచి వైద్యులకు భద్రత కల్పించాలి. నేను ఇంట్లో కుటుంబ సభ్యులతో ఎలా ఉంటానో..ఆసుపత్రిలో రోగులతో కూడా అలాగే ఉంటాను. రోగులను కుటుంబ సభ్యులుగా భావించి వైద్యం చేస్తాను. కోల్‌కతా ఘటన అనంతరం విధులకు వెళ్లాలంటే భయం వేస్తోంది. ఇలాంటి సంఘటనల వల్ల తమ పిల్లలను బాగా చదివించి డాక్టర్స్ చేయాలనుకునే తల్లిదండ్రులు వెనకడుగు వేసే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలి.

బి.వేణుశ్రీలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, రంగంపేట మండలం

క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి

పెదపూడి: జి.మామిడాడలో వేంచేసిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

రాజానగరం: మండలంలోని పల్లకడియంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన సుమారు 200 మంది రోగులకు కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, పీడి యాట్రిక్, గైనకాలజీ తదితర విభాగాలకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీవీఆర్ మల్టీ స్పెషల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ పాతూరి వెంకట్రామచౌదరి పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చావ ప్రసాద్, స్థానిక నాయకులు పాతూరి సురేష్, బి.రామచంద్రరావు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాన్ని చూసి ఆగిన ఎంపీ

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు సెంటర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. కడియం మండలం దుళ్లకు చెందిన ఖండవల్లి రామమణి (60) అనే మహిళ నడుచుకుంటూ సెంటరులో రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రమాదాన్ని చూసి ఆగారు. గాయపడిన మహిళకు ధైర్యం చెప్పి స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. ఎంపీ వెంట రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య ఉన్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జర్నలిస్టు యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

రంగంపేట: స్థానిక పత్రి రాయప్ప పంతులు ధర్మసత్రం వద్ద ఆదివారం మండల జర్నలిస్టు యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా కుందేటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా గరగడాల నాగేంద్రకుమార్, కార్యదర్శిగా డి.రాజేష్, సభ్యులుగా మద్దూరి వీరవెంకట సుబ్రహ్మణ్యం, మడక అప్పాజీ, తానంకి వేణు, వడిశల గోవిందు, కురికూరి మహేష్‌కుమార్, పల్లేటి సుందరరావు, మిరియాల రాజేష్‌కుమార్, చేబ్రోలు హరీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ నూతన అధ్యక్షుడు వెంకట రమణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

కడియం: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద గల గోసంరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు(బాబు) తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలకు గోపూజ అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. బుర్రిలంకలో కృష్ణాష్టమి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సీతాఫలం అధరహో !



దివాన్ చెరువు జాతీయ రహదారిపై అమ్మకానికి ఉంచిన సీతాఫలాలు



సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారులు

- ప్రారంభమైన సీజన్
- ఏజెన్సీ నుంచి తెచ్చి చాగల్నాడులో విక్రయాలు
- భారీగా పెరిగిన ధరలు
- దసరా నాటికి చాగల్నాడు ఫలాలు రాక

రాజానగరం: సీజనల్‌గా లభించే పండ్లలో సీతాఫలాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆరోగ్య ఫలంగా పేరొందిన సీతా ఫలాలు వర్షాలు సమృద్ధిగా పడే సమయంలోనే ఎక్కువగా లభిస్తాయి. ముఖ్యంగా చాగల్నాడు ప్రాంతంలో లభించే సీతాఫలాలకు గల్లీ నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకూ మంచి డిమాండ్ ఉంది. ఎందుకంటే ఇక్కడ దొరికే సీతాఫలాలు రుచిలో సిమ్లా యాపిల్‌ను మరపిస్తాయి. దీంతో వీటి ధర సైతం ప్రస్తుతం యాపిల్ పండ్లను మించిపోయింది.

గతంలో విస్తారంగా తోటలు

ఈ ప్రాంతంలో ఒకప్పుడు విస్తారంగా సీతాఫలాల తోటలు ఉండేవి. అంతేకాదు జాతీయ రహదారికి ఇరువైపులా కూడా ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా సీతాఫలాల తోటలు ఉండేవి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుణ్యమా అని ప్రస్తుతం ఈ ప్రాంతంలో వీటి మనుగడకే ప్రమాదం వాటిల్లింది. తోటలను నరికేసి, వెంచర్లు వేయడంతో సీతాఫలాల తోటలు క్రమేపీ తగ్గిపోతూ వచ్చాయి. దీనితో ఈ ప్రాంతంలో లభించే పండ్లకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ పలుకుతుంది. కానీ ఇక్కడ ఫలాలు మార్కెట్‌లోకి సెప్టెంబరు, అక్టోబరు మాసాలలోగానీ రావు. దీంతో ఏళ్ల తరబడి వీటి విక్రయాల ద్వారా జీవనోపాధి పొందుతున్న అనేక మంది వ్యాపారులు ప్రస్తుతం ఏజెన్సీలో లభిస్తున్న సీతాఫలాలను కొనుగోలు చేసి, చాగల్నాడులో మార్కెట్ చేస్తున్నారు. కొనుగోలు దారులు వాటిని చాగల్నాడు ఫలాలుగానే భావించి, కొనుగోలు చేయడంతో ప్రస్తుతం చాగల్నాడు మార్కెట్‌లో ఏజెన్సీ సీతాఫలాల హవా నడుస్తుంది.

వంద పండ్లు రూ.2 వేల పైనే...

ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో సీతాఫలాలు విస్తారంగా లభిస్తున్నాయి. అయితే వీటికి అక్కడ పెద్దగా మార్కెట్ ఉండదు. ఈ పరిస్థితుల్లో చాగల్నాడులో సీతాఫలాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, స్థానిక వ్యాపారులు కొందరు ఏజెన్సీ ఫలాలతో చాగల్నాడులో వ్యాపారం చేస్తున్నారు. వ్యాన్‌లపై ఇక్కడకు తీసుకువచ్చి, జాతీయ రహదారి వెంబడి ఉన్న చిరువ్యాపారులకు సరఫరా చేయడం ద్వారా వీటి వ్యాపారం జరుగుతోంది. సీతాఫలాలకు ఉన్న డిమాండ్‌ను అనుసరించి మార్కెట్‌లో ధరలు నిర్ణయిస్తున్నారు. ఏజెన్సీలో వంద ఫలాలు రూ. 500 లోపునే కొనుగోలు చేసినా, ఇక్కడకు వచ్చే సరికి వాటి ధర రూ.2 వేలకు పైనే పలుకుతోంది. కాయల సైజును బట్టి డజన్ల వారీగా రూ.250 నుంచి రూ. 500 వరకు విక్రయిస్తున్నారు.

ప్రత్యేకంగా తోటలు ఉండవు

ఏ ప్రాంతంలోనూ సీతాఫలాల తోటలంటూ ప్రత్యేకంగా ఉండవు. బత్తాయి, నారింజ, నిమ్మ, జామ, మామిడి, జీడిమామిడి తోటలలోనే ఇవి కూడా మిళితమై పెరుగుతుంటాయి. ఒకప్పుడు రైతులు వీటిని పెద్దగా పట్టించుకునే వారు కాదు. అయితే తోటలు తరిగిపోయి, ఫలాలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో వీటి సాగు పట్ల ప్రస్తుతం రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, మల్లంపూడి, తోకాడ, వీరవరం మున్నగు ప్రాంతాలలో సీతాఫలాలు తోటలు విస్తారంగా ఉన్నాయి.

రియల్ ఎస్టేట్ ప్రభావంతో తోటలు తగ్గాయి



రాజమహేంద్రవరం - రాజానగరం మధ్య రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో చాలావరకు పండ్ల తోటలను తీసేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో సీతాఫలాలు దొరకడమే కష్టంగా ఉంది. ఏ సమయంలో వస్తాయో, ఎప్పుడు అయిపోతాయో కూడా తెలియనంతగా తోటల విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ కారణంగానే ఇతర ప్రాంతాల నుంచి సీతాఫలాలను ఇక్కడకు తెచ్చి, వ్యాపారాలు చేయవలసి వస్తోంది.

పోసిన దుర్గారావు, చక్రద్వారబంధం

సాగుపై ఆసక్తి పెరిగింది



మార్కెట్‌లో సీతాఫలాలకు ఉన్న డిమాండ్‌తో ధర కూడా ఎక్కువగానే ఉంటోంది. ఒకప్పుడు వంద సీతాఫలాల ధర రూ.వందలోపే ఉండేది. కానీ ఇప్పుడు వందకు డజను కూడా రావడం లేదు. దీంతో ఆదాయ వనరుగా ఉన్న సీతాఫలాల సాగు పట్ల ఇటీవల కాలంలో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ విధంగానైనా తోటల విస్తీర్ణం పెరిగితే మంచిది.

పాలెపు సత్యనారాయణ, వెలుగుబంద

లఖ్‌పతి దీదీలకు రుణాల పంపిణీ



సీతానగరం స్త్రీశక్తి భవనంలో లఖ్‌పతి దీదీలకు నమూనా చెక్కును అందిస్తున్న ప్రజాప్రతినిధులు

సీతానగరం: మండలంలోని డ్వాక్రా సంఘాల లఖ్‌పతి దీదీలకు ఆదివారం రుణాలు పంపిణీ చేశారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కురివేళ్ల కస్తూరి ఆధ్వర్యంలో ఏపీఎం మహాలక్ష్మి పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు లఖ్‌పతి దీదీలకు రుణాల పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా జూలై ఒకటి నుంచి ఇప్పటి వరకు 26 డ్వాక్రా గ్రూపుల్లోని 265 మంది సభ్యులకు రూ.3.20 కోట్ల రుణాలకు సంబంధించిన నమూనా చెక్కులను, ప్రశంసా పత్రాలను వీఓఏలకు అందించారు. ఈ సందర్భంగా ఏపీఎం మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని మహిళలను లక్షాధికారిని చేయాలనే ఉద్దేశంలో అందించిన ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడాదికి లక్షకు పైగా కుటుంబ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ ఎస్.జయరాజ్, గ్రామ సంఘ సహాయకులు వై.సునీత, కె.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు

వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ



కాండ్రేగుల గ్రామంలో వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధ

పెదపూడి: నిరుపేదల ఆశాజ్యోతి దివంగత మాజీ ఎమ్మెల్యే, కాపు నేత వంగవీటి మోహన్‌రంగా అని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, వంగవీటి రాధ అన్నారు. మండలంలోని కాండ్రేగుల గ్రామంలో స్థానిక రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆదివారం ఆయన కుమారుడు వంగవీటి రాధ ఆవిష్కరించారు. ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా అందరి వాడన్నారు. కులం, మతం, వర్గాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన నేత అని కొనియాడారు. యువత రంగా ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎన్డీఏ నాయకులు పుట్టా గంగాధర్ చౌదరి, జుత్తక సూర్యకుమారి, నాగిరెడ్డి వీరస్వామి, కొటికలపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: స్థానిక వైఎంవీఏ హాలులో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలురు, బాలికల చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో విష్ణుసాయి, అద్రిత్, త్రినాథ్‌కుమార్, కార్తికేయలు విజయం సాధించగా, బాలికల విభాగంలో రిషిత, అనన్య, నేహశ్రీ, తబ్బుసమ్‌లు గెలుపొందారు. విజేతలు సెప్టెంబర్ నెలలో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈండ్రి ప్రేమ్‌కుమార్(60) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ నెల 21న పాఠశాలలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఆయన రైల్వే స్టేషన్ వెనుక ఆవరోడ్‌లో కుక్కలు అడ్డురావడంతో బైక్ మీద నుంచి పడిపోయారు. గాయాలపాలైన ఆయనను ఆసుపత్రిలో చేర్చడంతో మోకాలిచిప్ప పగిలిందని శుక్రవారమే సర్జరీ చేశారు. అయితే శనివారం సాయంత్రం గుండె బరువుగా ఉందని చెప్పడంతో ఆయనను ఐసీయూలోకి మార్చారు. వైద్యం జరుగుతుండగా ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రేమ్‌కుమార్ మృతిపై మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందుకుమార్, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, హెచ్ఎం నరసింహారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బాధితులకు సాయం

ఏలేశ్వరం: పట్టణంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు ఆదివారం దాతలు సాయం అందజేశారు. పట్టణానికి చెందిన వాగు రాజేష్ తన కుమారుడు సాత్విక్ పుట్టినరోజు సందర్భంగా బాధితుకు వంట సామగ్రి, కిరాణా, రూ.10 వేల నగదు అందజేశారు.

కోరుకొండ ఎస్సైగా శ్యామ్‌సుందర్



ఎస్సై శ్యామ్ సుందర్



కోరుకొండ నుంచి బదిలీ అయిన ఎస్సై ఆనందకుమార్‌కు సత్కరిస్తున్న పోలీసులు

మధురపూడి: కోరుకొండ ఎస్సైగా టీఎస్‌వీఎస్ శ్యామ్‌సుందర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కొవ్వూరు రూరల్ డివిజన్ తాళ్లపూడి పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న ఆయన బదిలీపై కోరుకొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన కోరుకొండకు బదిలీ కావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. కోరుకొండ పరిధిలో గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్సై ఆనందకుమార్ బదిలీ

ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన డి.ఆనందకుమార్ విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆనందకుమార్‌ను స్థానిక పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు. నూతన ఎస్సై శ్యామ్ సుందర్, బదిలీపై వెళ్తున్న ఆనందకుమార్‌లను పోలీసులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే కోరుకొండ ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు సైతం కొత్త ఎస్సై శ్యామ్‌సుందర్, బదిలీ అయిన ఆనందకుమార్‌లను సత్కరించారు.

స్టెమ్ ల్యాబ్ ప్రారంభం



ఊలపల్లిలో స్టెమ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలోని ముల్లంగి బులి వీరన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. పాఠశాల వద్ద ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలోని ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ఉపకరణాలు వినియోగించుకుని చక్కటి ఫలితాలు సాధించాలన్నారు. స్టెమ్ ల్యాబ్ విద్యార్థులు చదువు మెరుగుపడుతుందన్నారు. విషయాన్ని చూడడం, వినడం, ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం ద్వారా విద్యార్థి త్వరగా గ్రహించి ఎక్కువ కాలం గుర్తుంచుకోవడానికి దోహదం చేస్తుందనన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, సర్పంచి బండారు రమ్య, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైస్పీడ్ స్వీపింగ్ మెషీన్స్ అందించిన ఎమ్మెల్యే

మండలంలోని ఊలపల్లిలోని సీఎస్ఆర్ ప్రాజెక్టు ఆఫ్ కోల్ ఇండియా లిమిటెడ్, పెదాపురం-సామర్లకోట, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 50 మంది మహిళలకు హైస్పీడ్ స్వీపింగ్ మెషీన్స్ అందించారు. కార్యక్రమంలోని సర్పంచి బండారు రమ్య, స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ సీఈవో కోట్ల శివ శంకర్‌రావు, రోటర్లీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియానికి మహర్దశ

- రాళ్లబండి సుబ్బారావు మ్యూజియానికి నూతన భవనం
- మాజీ ఎంపీ భరత్‌రామ్ చొరవతో నిర్మాణం
- రూ.3.10 కోట్లతో కొనసాగుతున్న పనులు



రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం పాత భవనం(ఫైల్)



మ్యూజియంలో విగ్రహాలను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక రాజమహేంద్రవరం నగరంలో ప్రతిష్టాత్మకమైన పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాళ్లబండి సుబ్బారావు మ్యూజియానికి మహర్దశ పట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యులు మార్గాని భరత్ రామ్ చొరవతో పురావస్తు శాఖ తవ్వకాల్లో బయటపడిన పలు పురాతనమైన వస్తువులను భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన మ్యూజియానికి ఆధునిక నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3.10 కోట్ల నిధులు సాధించారు. దీంతో భవన నిర్మాణం చేపట్టేందుకు 2023 అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు.

శతాబ్దాల కాలం నాటి చరిత్ర

1956 ప్రాంతంలో చారిత్రక పరిశోధన పిపాసి అయిన రాళ్లబండి సుబ్బారావు శతాబ్దాల కాలం నాటి చరిత్రకు సంబంధించిన పురావస్తు ప్రదర్శనశాలను రాజమహేంద్రవరంలో ప్రారంభించారు. ఈ మ్యూజియంలో చరిత్ర పూర్వయుగం నుంచి మధ్యయుగం వరకూ వాడిన వివిధ పనిముట్లు, రాతియుగం కాలం నాటి గొడ్డళ్లు, చారిత్రక యుగం నాటి మట్టిపాత్రలు, రాజుల కాలం నాటి కత్తులు, కటార్లు, నాణేలు, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, రాతి విగ్రహాలు, కంచు విగ్రహాలు.. ఇలా అనేక వస్తువులు ప్రదర్శనకు ఉంచేవారు. రాజోలు మండలంలోని తాటిపాకలో లభ్యమైన 11వ శతాబ్దానికి చెందిన వర్ధమాన మహావీరుడి విగ్రహం, ధవళేశ్వరం-వేమగిరి మధ్య తవ్వకాల్లో బయటపడిన శైవపానవట్టం, వరంగల్‌లోని రామప్ప దేవాలయం నుంచి సేకరించిన నీటిపై తేలియాడే కాకతీయుల కాలం నాటి ఇటుక సందర్శకులకు ఎంతగానో ఆకట్టుకునేవి. శిథిలావస్థకు చేరుకున్న మ్యూజియం భవనం స్థానంలో మూడంతస్తుల భవనం నిర్మించాలని గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ఎంపీ భరత్‌రామ్ సంకల్పించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రయత్నాలు సాగించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.3.11 కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో పురావస్తు శాఖ అధికారులు పురాతన వస్తువులను బొమ్మూరులోని పురావస్తు శాఖ కార్యాలయానికి తరలించారు. పాత భవనాన్ని తొలగించి 2023 అక్టోబర్ 18 తేదీన ఫస్ట్ ఫ్లోర్, సెల్లార్‌తో కూడిన నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. 18 నెలల కాల పరిమితితో భవనాన్ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మూడంతస్తులకు మోక్షం లభించేనా

ప్రతిష్టాత్మకమైన శ్రీరాళ్లబండి సుబ్బారావు మ్యూజియాన్ని ప్రస్తుతం నిర్మిస్తున్న మొదటి అంతస్తుతో పాటు మరో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించాలని పలువురు చారిత్రకవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. అనేక పురాతనమైన వస్తువులకు ప్రదర్శించేందుకు సరైన స్థలం లేకపోవడంతో ఎండకు ఎండి వానకు తడిసి ఆరు బయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలువురు సందర్శకులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సంయుక్తంగా ప్రత్యేక దృష్టి సారించి మరో రెండు అంతస్తుల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

2027లో రానున్న పుష్కరాలకు మూడంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోనికి తీసుకొస్తే పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అద్భుతమైన వస్తువులను ప్రదర్శించేందుకు వెసులుబాటు కలుగుతుందని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై పురావస్తు శాఖ అధికారి తిమ్మరాజును వివరణ కోరగా నిర్ణీత సమయానికి భవనం నిర్మాణం పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

మరో రెండతస్తులకు నిధులివ్వాలి



పురాతనమైన వస్తువులను ప్రదర్శనకు ఏర్పాటుచేసే రాళ్లబండి సుబ్బారావు మ్యూజియానికి ఎన్డీఏ ప్రభుత్వం మరిన్ని నిధులు సమకూర్చాలి. మరో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తే దేశం నలుమూలల నుంచి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ విషయంలో ప్రజాప్రతినిధులంతా స్పందించాలి.

– వేగిరౌతు సత్యనారాయణ, రాజమహేంద్రవరం

అద్భుతమైన మ్యూజియం



పురావస్తు శాఖ ఆధ్వర్యంలో 11వ శతాబ్దం నుంచి సేకరించిన పురాతన వస్తువులను ప్రదర్శనకు ఉంచే ఏకైక మ్యూజియమిది. పురాతన వస్తువులను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా మ్యూజియాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. మ్యూజియంలో ఏ ఒక్క పురాతన వస్తువు పాడవ్వకుండా చర్యలు తీసుకోవాలి.

– బి.అక్షయ త్రిష రెడ్డి, డిగ్రీ విద్యార్థిని, రాజమహేంద్రవరం